కథ

# అర్జకుడి ఆరోగ్యం

ఎలక్ట్రాన్

సాయంత్రం మూడూ నలభైకి రావల్సిన చెన్నై-హౌరా కోరమాండల్ ఎక్స్‌ప్రెస్ ఏభై నిమిషాలు ఆలస్యంగా విజయవాడ చేరింది. ఓ చిన్న బ్రీఫ్‌కేసూ, ఓ మధ్యసైజు సూట్‌కేసూ పట్టుకొని అటెండర్ భద్రం వెంట రాగా కాస్త దర్పంగానే మొదటి తరగతి ఏ.సి. కోచ్‌లో అడుగుపెట్టాను. ఆ దర్పం కృత్రిమమైనదని నాకు తెలుసు.

ఎందుకంటే నేను ఆఫీసు పని మీద వెడ్తున్న ప్రభుత్వోద్యోగిని. లోపలికి వెళ్లిన తరువాత 'డి' కేబిన్‌లో నా బెర్త్ కింద సూట్‌కేస్‌నీ, కార్నర్ టేబుల్ మీద బ్రీఫ్ కేస్‌నీ ఉంచి భద్రం సెలవు తీసుకొని వెళ్లిపోయాడు. ఆ కేబిన్‌లో ఉన్న ముగ్గురూ నాకేసి ఒకసారి చూసి, తిరిగి తమ కబుర్లలో పడిపోయారు. వారి మాటలని బట్టి వారు చలనచిత్ర రంగానికి చెందినవారనిపించింది.

నేను కూర్చున్న కొద్దిసేపటికే బండి కదిలింది. బండి కదిలిన పావుగంటకి బ్రీఫ్ కేస్ తెరిచి ప్రపంచ వ్యాప్తంగా సంచలనం సృష్టించిన 'డాన్ బ్రౌన్' నవల 'డావిన్సీ కోడ్' చదవనారంభించాను. హస్త భూషణంగా ఆంగ్ల పుస్తకముంటే దర్ప ప్రదర్శన మరింత బరువుగా ఉంటుందని అపోహ పడే వారిలో నేనూ ఒకణ్ని. రాత్రి తొమ్మిది ప్రాంతంలో అల్యూమినియం ఫాయిల్లో శ్రీమతి చుట్టి ఇచ్చిన రెండు ఆలూపరోఠాలనీ నిమ్మపేడుతో నంజుకుని తిని, అర సీసాడు కృష్ణనీరు సేవించి ముసుగుతన్నాను. ఉదయం సరిగా పదిన్నరకి ఎక్స్‌ప్రెస్ ఖర్గపూర్ చేరింది. ఇంత దూరప్రయాణంలో విజయవాడ వరకూ అయిన ఏభై నిమిషాల ఆలస్యాన్నీ కవర్ చేసేసింది. ఆపాటికే కాలకృత్యాలన్నీ తీర్చుకొని, తేలికపాటి అల్పాహారంతో ఉపవాస భంగం చేసి సిద్ధంగా కూర్చున్న నేను బండి దిగాను. సామాన్లు ప్లాట్‌ఫారం మీద పెట్టి, పోర్టర్‌కేసి అటూ ఇటూ చూశాను.

ఎవరో పెద్దమనిషి బండెక్కి గుమ్మం దగ్గర నిలబడి, ''కోల్‌కతాలో ఈ రోజు సాయంత్రం చర్చలు ముగిసిన తర్వాత వాళ్లేమైనా సూచించిన మార్పుల గురించి నీకు ఫోన్ చేసి చెబుతాను. మెషీన్ షాప్ వాళ్లని సిద్ధంగా ఉంచి హెచ్చరించు. అసలే పూజా (దసరా) రోజులు. కుంటిసాకులు చెప్పి సెలవు మీద చెక్కేస్తారు. ఎట్టి పరిస్థితుల్లోనూ సెలవు మంజూరు చేయబడదని చెప్పు. సరే మిత్రా, నువ్వింక వెళ్లు, బైబై!'' అన్నాడు.

''అలాగే, అగర్వాల్‌దా! మీరు లోపలికి వెళ్లండి'' అన్నాడు కిందనున్న మనిషి. ఆ అగర్వాల్ అనబడే పెద్దమనిషి లోపలికి వెళ్లిపోయాడు.

మిత్రా అన్న పేరూ, సమాధానమిచ్చిన అతని గొంతు తీరూ విని పరిశీలనగా చూశాను. సందేహం లేదు, వాడే! ''అరే మిత్రా! ఎన్నాళ్లకెన్నాళ్లకు?'' అన్నాను బెంగాలీలో ఎదురుగా నిల్చుని.

ఒక్క క్షణం బిత్తరపోయాడు. మరుక్షణం కళ్లలో జ్ఞాపకాల వెలుగు. ''నిజంగానే ఎన్నాళ్లకు కలుసుకొన్నాం శేఖర్‌దా!'' అంటూ నన్నోసారి గట్టిగా కౌగిలించుకొని విడిచాడు.

''అనుకోని విధంగా ఈ రోజున కలుసుకోవడం చాలా ఆనందంగా ఉంది'' అన్నాను చాలా ఆప్యాయంగా.

''చిత్రమైన సంగతేమిటంటే- మా బాస్ ఊరు వదలి బయటకు వెడ్తున్నప్పుడల్లా వీడ్కోలివ్వడానికి ఎవరో ఒకరు రావాలి! బయటి మనుషుల ఎదుట ఆజ్ఞలు జారీ చేయడం ఆయనకి మహా సరదా! పైకి వినిపించకుండా పళ్లు కొరికిన సందర్భాలనేకం ఉన్నాయి. అయితే ఆయనగారీ అలవాటే మనిద్దరం ఇలా యాదృచ్ఛికంగా కలుసుకోవడంలో సహాయం చేసింది!'' అన్నాడు మిత్రా.

నేనెంతగా వద్దంటున్నా ''మోసే బరువు కాదు కదా లాగే బరువు! పర్వాలేదు'' అంటూ సూట్‌కేసు హేండిల్‌ని పట్టుకొని లాగుతూ అడుగు వేశాడు. బ్రీఫ్ కేస్ పట్టుకొని మిత్రా పక్క నడవసాగాను.

''జర్మనీ నుంచి వచ్చిన ఓ నలుగురు నిపుణులు ఖర్గపూర్ రైల్వే సెంట్రల్ వర్క్ షాప్‌లో రేపట్నుంచి రెండు రోజుల పాటు ఓ సదస్సుని నిర్వహిస్తున్నారు. నేనూ ఓ పేపరు చదవాల్సి ఉంది. విజయవాడ నుంచి వస్తున్నాను'' అన్నాను, నేను ఖర్గపూర్ ఎందుకు వచ్చిందీ చెబ్తూ.

''ఈ మీ సదస్సుకి సంబంధించే అనుకొంటాను స్టేషన్ మెయిన్ హాల్లో ఆహ్వాన సంఘ సభ్యులు బేనర్ కట్టి కూర్చున్నారు'' అన్నాడు మిత్రా.

ఏవో కబుర్లు చెబ్తూ, ప్రశ్నలడుగుతూ స్టేషన్ మెయిన్ హాల్లో ఉన్న ఆహ్వాన సంఘం దగ్గరకు నేరుగా తీసుకుపోయాడు. వాళ్లు నా పేరు అదీ లిస్టులో చూసి, ''మీకు రైల్వే వర్క్ షాపు గెస్ట్ హవుస్‌లో రూం నెంబరు 214 కేటాయించబడింది. బయట కార్ పార్కింగ్ ఏరియాలో ఓ మినీ బస్ బేనర్‌తో ఉంది. మీరు వెళ్లి అందులో కూర్చోండి. ఇంకో పదిహేను నిమిషాల్లో బయలుదేర్తుంది'' అని, 214 నెంబరూ, నా పేరూ రాయబడి ఉన్న ఓ చిన్న లామినేటెడ్ కార్డ్ నా చేతికందించారు.

మిత్రా నన్ను బస్‌వరకూ తీసుకుపోయి, అందులో ఎక్కించి, నా పక్కన కూర్చుని అన్నాడు. ''నేనిప్పుడు మా ఫ్యాక్టరీకి పోతున్నాను. తప్పనిసరిగా వెళ్లాలి. రాత్రి తిరిగి ఇల్లు చేరేసరికి పది దాటుతుంది. రేపు మధ్యాహ్నం గోమియా వెళ్లాలి. రెండు రోజులు నిండుగా పని. సెలవడగడానికి వీలు లేని పరిస్థితి. మళ్లీ నిన్ను కలుసుకోవడం కుదరకపోవచ్చు. అందుకని రేపు ఉదయం సరిగా ఎనిమిదింటికి నీ రూంకి వస్తాను. నీకు రేపు మా ఇంట బ్రేక్‌ఫాస్ట్‌తో ఆతిథ్యం! మా ఆతిథ్యం ముగిసిన తర్వాత నిన్ను మీ కాన్ఫరెన్స్ హాల్ దగ్గర దిగబెట్టి మా ఫ్యాక్టరీకి పోతాను. అక్కణ్నుంచే మధ్యాహ్నం ఎక్స్‌ప్రెస్‌లో నా గోమియా ప్రయాణం''

ఏ సంగతైనా మనసు విప్పి, మాటనాన్చకుండా చెప్పడం మిత్రా అలవాటు. ''అలాగే'' అని నా చేత అనిపించుకొని, బస్ దిగి స్కూటర్ స్టాండ్ వైపు నడిచాడు. కోరమాండల్లోంచి దిగినప్పట్నుంచీ, బస్సులో నన్ను కూర్చోపెట్టి వదిలి వెళ్లేవరకూ మిత్రా చెప్పిన సంక్షిప్త వివరాలివి. భారీ పరిశ్రమల్లో ఉపయోగపడే హైడ్రాలిక్ పంపులనీ, మోటార్లనీ తయారుచేసే ఓ సంస్థలో సీనియర్ ఫోర్‌మెన్‌గా పన్జేస్తున్నాడు. ఎప్పటికప్పుడు టెండర్లూ అవీ, ఇవీ అంటూ తలనొప్పి వ్యవహారం. ముడుపులూ, తడుపుల వ్యవహారాల్లో బాస్ తలమునకలుగా ఉంటాడు. ఆర్డర్లు వస్తేనే కానీ సంస్థ ఆరోగ్యంగా ఉండదు. పని చెబ్తే రూల్సడిగే వర్కర్లతో ప్రతినిత్యమూ హోరా హోరీ తల

బడితే కాని అడుగు ముందుకు వేయలేని పరిస్థితి. పనిచేయించడమే పనైతే అంతకు మించి కష్టమైన పని లేదన్న మిత్రా అభిప్రాయంతో ఏకీభవించక తప్పదు.

మిత్రాకి నలుగురు సంతానం. ఇద్దరు అబ్బాయిలూ, ఇద్దరు అమ్మాయిలు.

ఇక మా పరిచయమెలా అంటే నాన్నగారు కోల్‌కతాలో పన్జేస్తున్నప్పుడు, నాక్‌తలా అనే ఏరియాలో మా రెండు కుటుంబాలు పక్కపక్క పోర్షన్లలో అద్దెకుండేవి. నేనూ, మిత్రా ఆరో తరగతి నుంచి ఇంటర్మీడియేట్ వరకూ కలిసి చదువుకొన్నాం. నేను మద్రాసు ఐ.ఐ.టి.లో ఇంజనీరింగ్‌లో చేరాను. మిత్రా కోల్‌కతాలోనే పాలిటెక్నిక్‌లో చేరాడు. అటు తర్వాత మా నాన్నగారికి విశాఖపట్నం బదిలీ అవడంతో రెండు కుటుంబాలూ దూరమై పోయాయి. నాకూ మిత్రాకు ఓ ఏడాది పాటు జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలు క్రమేపీ పల్చబడిపోయి, ఆ తర్వాత ఒకరికి మరొకరికి తెలియకుండా పోయింది. పద్దెనిమిది సంవత్సరాల వయసులో విడిపోయిన మేము ముప్పై ఏడు సంవత్సరాల తర్వాత యాదృచ్ఛికంగా కలుసుకోవడం ఓ అద్భుతమైతే, వయసు మార్చిన రూపాల్ని కూడా ఒక్క క్షణంలో గుర్తించగలగడం మరో అద్భుతం.



సదస్సులో నేను చదవవలసిన పేపర్ని ఆ రాత్రి ఒకటికి రెండుసార్లు పునఃపరిశీలించుకొని నిద్రకుపక్రమించాను. మర్నాడు ఉదయం ఎనిమిదవ్వడానికి ఓ పావుగంట ముందుగానే మిత్రా వచ్చేసరికి నేనూ సిద్ధంగానే ఉన్నాను. వెంటనే బ్రీఫ్ కేసు తీసుకొని మిత్రా వెంట బయలుదేరాను. అతని స్కూటర్ మీద పది నిమిషాల్లో అతనుండే ఇల్లు చేరుకొన్నాం.

మిత్రా భార్య చీరకొంగుని నెత్తి మీద సవరించుకొని, నమస్కారం చేసి సాదరంగా ఆహ్వానించింది. మిత్రా తన కుటుంబ సభ్యుల్ని పరిచయం చేశాడు. పెద్దవాడు ఎమ్.కాం. తర్వాత అమ్మాయి ఎమ్.ఏ. ఇద్దరూ ఉద్యోగాన్వేషణలో ఉన్నారు. తర్వాత మరో అబ్బాయి, అమ్మాయి. ఇంకా కాలేజి చదువుల్లో ఉన్నారు. నేను సునాయాసంగా బెంగాలీలో మాట్లాడ్డం చూసి మిత్రా కుటుంబం ఒకింతగా ఆశ్చర్యపోయిందనే చెప్పుకోవాలి. ''మీరు కోల్‌కతాలో చదువుకొన్నారని తెలిసింది. ఇంతకాలమయ్యా బెంగాలీ మర్చిపోలేదంటే ఆశ్చర్యమేమరి!'' అంది మిత్రా భార్య.

క్రితం రోజు సాయంత్రం రైల్వే గెస్ట్ హౌస్ ప్రాంతంలో ఉన్న ఓ మిఠాయిల దుకాణంలో దాస్ కంపెనీవాళ్ల సీల్ చేసిన రసగుల్లా డబ్బా కొన్నాను. దాన్ని బ్రీఫ్ కేసులోంచి తీసి మిత్రా భార్యకందించాను. ఆమె ప్రశ్నించగా నా కుటుంబ వివరాలు చెప్పాను.

కాస్సేపు ఆ కబుర్లూ, ఈ కబుర్లూ చెప్పుకొని ఎనిమిదిన్నరకల్లా డైనింగ్ టేబుల్ వద్ద కూర్చున్నాం. పైన పంకా మందకొడిగా తిరుగుతోంది. మిత్రా సంతానం కాస్త ఇబ్బందిగానే కూర్చున్నారనిపించింది. ఎంత కాదనుకొన్నా ఓ

తరం అంతరం ఉంది కాబట్టి దాని ప్రభావం అది చూపించకపోదు.

బల్లమీద బెంగాల్ పాటరీస్ బ్రేక్‌ఫాస్ట్ సెట్ అందంగా అమర్చబడి ఉంది. బల్ల మధ్యగా ఓ సిర మిక్ పళ్లెంలో ఉడకబెట్టి, పెంకులు తీసిన ఎనిమిది గుడ్లు తెల్లగా మెరుస్తున్నాయి. మరో పళ్లెంలో కాల్చి, వెన్నరాసి పేర్చిన రొట్టెముక్కలు. ఒక కాసిరోల్ నిండా పచ్చి బఠాణీలూ, క్యారెట్ ముక్కలూ వేసి చేసిన రవ్వ ఉప్మా. మిత్రా భార్యకేసి చూస్తూ ''మా అమ్మ నీకు నేర్పిన దక్షిణాది వంటకా లన్నీ వీళ్లమ్మగారి దగ్గర నేర్చుకొన్నవే!'' అని, ఆ తర్వాత నాకేసి చూస్తూ అన్నాడు. ''శేఖర్‌దా! నువ్వు శాకాహారివ నిచెబ్తే ఇడ్లీ, దోసెలు చేసే వ్యవధి లేక ఉప్మా చేసింది శ్రీమతి. సర్టిఫికేట్ ఇస్తే తనకంటే సంతోషించే వారు మరొహ రుండబోరు! అయితే చిన్న అపసవ్యమే మిటంటే, నువ్వు మీ పెసరట్టు బదులు బ్రెడ్‌తో సరిపెట్టుకోవాలి!''

మిత్రా నా ప్లేట్లో దండిగానే ఉప్మా వడ్డించి, ఓ మూడు రొట్టెముక్కలు వేశాడు. తన ప్లేట్లో మూడు గుడ్లూ, ఆరు రొట్టెముక్కలూ వేసుకొని, కొద్దిగా ఉప్మా వడ్డించుకొన్నాడు. మిత్రా నలుగురు సంతానమూ తలో గుడ్డూ, మూడేసి రొట్టెముక్కలూ తీసుకొని, కొద్ది కొద్దిగా ఉప్మా వేసుకొన్నారు. మిత్రా భార్య రెండు రొట్టెముక్కలు తీసుకొని, ఉప్మా వారందరికంటే కాస్త ఎక్కువగానే వేసుకుంది. మిగిలిన గుడ్డుని తీసుకోలేదు.

మిత్రా ఆ మూడు గుడ్లనీ, ఆరు రొట్టె ముక్కల్నీ చాలా తృప్తిగా, ఆనందంగా ఆరగిం చాడు. ఉప్మా బాగానే ఉంది. ఓ రెండు చెంచాలు తిన్న తర్వాత ఉప్మా బాగా చేశారని మిత్రా భార్యకి అభినందనలు తెలిపి, అటుపైన ప్లేటు ఖాళీ చేశాను. ఫలితంగా, మిత్రా భార్య బలవంతంగా వడ్డించిన మరో గరిటెడు ఉప్మా తినకతప్పలేదు. మిత్రా పెద్ద కొడుకు పళ్లెంలో మిగిలిన గుడ్డువైపు చెయ్యి చాచడం, 'అమ్మకొద్దా?' అన్నట్లుగా మిత్రా చూడడం, చిన్నబుచ్చుకొన్న మొహంతో మిత్రా పెద్దకొడుకు చెయ్యి వెనక్కి తీసుకోవడం నేను గమనించకపోలేదు. ఏదో చిన్న అపశ్రుతి గోచరించింది.

ఆ తర్వాత మిత్రా భార్య అందరికీ చిన్న స్టీలు గిన్నెల్లో 'రసమలాయ్' అందించింది. మిత్రా అమ్మగారు వాళ్లింట్లో ఈ స్వీట్ చేసినప్పుడల్లా మాకందరికీ ఇచ్చేవారు. మిత్రాకేసి చూస్తూ, ''నువ్వు మర్చిపోలేదు, థాంక్స్!'' అన్నాను.

చివరగా మిత్రా భార్య అందరికీ టీ ఇచ్చింది. ''ఫిల్టర్ కాఫీ చెయ్యగల దక్షిణాది హస్తాలు 'టీ' అనేసరికి కాస్త వెనుకాడుతాయి. టీ చెయ్యడానికి చాలా నేర్పు కావాలి. ఇంతకాలం తర్వాత ఈ రోజు నిజంగా చాలా మంచి టీ తాగాను!'' ముఖస్తుతిగా కాకుండా చాలా నిజాయితీగా అన్నాను. అటుత ర్వాత మిత్రా సంతానాన్నుద్దేశిస్తూ, ''నా రాక మూలాన మీరందరూ మీ అలవాటు సమయా నికి ముందుగానే బ్రేక్‌ఫాస్ట్ చేశారనుకొంటాను?'' అన్నాను. పైకి అనకపోయినా ఆ మాటల్లో నేను 'సారీ' చెప్పుకోవడం జరిగింది.

''జస్ట్ ఓ అరగంట ముందుగా మాత్రమే తీసుకో వడం జరిగింది. అందుకు నువ్వు నొచ్చుకోవలసిన అవసరం లేదు. అసలు నేను మధ్యాహ్నం ఇంటికి రావడమనేది కుదరదు. రాత్రుళ్లు ఎప్పుడు వస్తానో తెలియదు. అందుకని ఈ బ్రేక్‌ఫాస్ట్ తతంగమంతా అందరం ఒకేసారి కానిస్తాం. నాకు వీళ్లందరితోటీ గడపగల సమయమిదొక్కటే. అదీకాక ఫాన్ తిరిగే ఖర్చు కలిసొస్తుంది!'' అన్నాడు మిత్రా నవ్వుతూ.


''అంతే కాదంకుల్! తనింట్లో ఉన్నా లేకపోయినా నాస్తాలూ, భోజనాలూ, టీ, టిఫిన్లూ అన్నీ ఒకే సారి జరగాలన్న నియమం పెట్టేశారు! కరెంటు బిల్లు ఒక్క చదువుకి తప్ప ఇత రత్రా పెరిగితే క్లాసు పీకేస్తారు!'' అంది మిత్రా ఆఖరి కూతురు కాస్త చొరవ తీసు కొని.

అనవసరంగా ఆ మాటన్నానేమో అని పించింది. కూతురన్న దానికి మిత్రా నవ్వుతూనే సమాధానమిచ్చాడు. ''మా అమ్మాయి చెప్పింది నిజమే. అయితే కొన్ని ప్రయోజనాలు కూడా ఉన్నాయి. శ్రీమతికి శ్రమ తప్పుతుంది. నలు గురూ కలిసి నాలుగు మాటలు చెప్పు కొనే వీలు కలుగుతుంది. మనసులతో దాగుడుమూతలాడుకోవలసిన అవసర ముండదు. రెండు ముక్కల్లో మా అమ్మాయి నా గురించి నీకెంతో చెప్పిం దనే అనుకొంటాను!''

ఏదో అనబోయి ఆగాను. ఆ తర్వాత మరో పది నిమిషాల్లో మిత్రా కుటుంబ సభ్యుల దగ్గర సెలవు తీసుకున్నాను. కాన్ఫరెన్స్ హాలు పోర్టికోలో నన్ను దింపి, మిత్రా ప్రశ్నించాడు. ''ఇందాకా ఏదో అనబోయి ఆగిపోయావు, ఏమిటది?''

''అందరూ కలిసి తినడంలో తృప్తి లభి స్తుందని గొప్పలు చెప్పిన నువ్వు మూడు గుడ్లు మెక్కి, రెండో గుడ్డు కోసం నీ పెద్ద కొడుకు చెయ్యి చాస్తే గుడ్లురిమి చూశావు! అది పైశాచికమైన ఆనందం తప్ప మరోటి కాదు!'' అన్నాను కాస్త తీవ్ర స్వరంతోనే.

మిత్రా నొచ్చుకోలేదు. మొహం మీద



## ఐటెంగర్ల్

**తారలు ఎంత బిజీగా ఉన్నా కొన్ని కొన్ని ఐటెం సాంగ్స్‌నుంచి తప్పించుకోలేరేమో అన్పి స్తుంది. ఎందుకంటే పెద్ద పెద్ద హీరోయిన్లు కూడా ఇప్పుడీ పరిస్థితికి తలవొగ్గుతున్నారు. సెక్సీసైరన్ పులకింత హీరోయన్ మేఘనానా యుడు ఇప్పుడో తెలుగుసినిమాలోని ఐటెంనెం బర్ సాంగ్‌లో నర్తిస్తోంది. రవితేజ కొత్త చిత్రం విక్రమార్కుడులో స్పెషల్ సాంగ్‌లో నటి స్తోంది. ఎం.ఎం.కీరవాణి ఈ పాటని కంపోజ్ చేశారు. రాజమౌళి దర్శకత్వం వహిస్తున్నారీ చిత్రానికి.**

చిరునవ్వు చెదరలేదు. చేతి వాచి వైపు చూశాడు.

''ఫర్వాలేదు, నీకూ నాకూ ఇంకా టైముంది. ఓ చిన్న క్లాసు పీకుతాను, శ్రద్ధగా విను! జన్మనిచ్చినందుకు తల్లిదండ్రుల్నీ, కట్టుకొన్నందుకు భార్యనీ, కన్నందుకు ప్రయోజకులయ్యే వరకూ సంతానాన్నీ పోషించవలసిన బాధ్యత ప్రతి వ్యక్తీ వహించవలసిందే. సహజంగా ఈ బాధ్యతతో బాటు కుటుంబ యజమానికి కొంత అధికారం కూడా సంక్రమిస్తుంది. ఈ బాధ్యత నిర్వహించడానికి ధనార్జన కావాలి. ధనార్జన చేస్తేనే ఇంటా బయటా మాట చెల్లుతుంది. ఈ ధనార్జనకి దమ్ములున్నవాడు వ్యాపారం చేస్తే, లేని వాడికి ఉద్యోగమే గతి. అది రోజు కూలీ కావొచ్చు. నెల జీతం కావొచ్చు. ప్రభుత్వ రంగం కావొచ్చు, ప్రైవేటు రంగం కావొచ్చు. ప్రభుత్వ రంగంలో అసమర్థతకి శిక్ష లేదు. అవినీతికి శిక్ష ఉన్నా నూరుమంది అవినీతిపరులలో ఒక్కరి ఉద్యోగం పోవడం కూడా చాలా అరుదైన విషయం. ప్రైవేటు రంగంలో అలా కాదు. ఉద్యోగం నిలుపుకోవాలంటే సామర్థ్యం ముఖ్యం. శ్రమించి పనిచేయడం ముఖ్యం. దానికి ఆరోగ్యం ముఖ్యం. నాకు చెయ్యి చాచి అవసరాలు తీర్చుకోవడం ఇష్టం లేదు. ఉన్నదానిలోనే బతకాలన్నది నా ధ్యేయం. అందుకే ప్రతి దానికీ ఓ బడ్జెట్ వేసుకోవడానికలవాటు పడిపోయాను. కరెంటు బిల్లులు, టెలిఫోను బిల్లులు, పిల్లల చదువులు, వాళ్లకి చేతి ఖర్చులు, తిండి ఖర్చులు, ఆడపిల్లల వివాహాల నిమిత్తం పొదుపులు వగైరా, వగైరా. తిండికెంత బడ్జెట్ అంటే ఇదమిత్థంగా సమర్థించుకోలేను. నా కుటుంబం ఆకలితో మాడకూడదు, అజీర్తితో బాధపడకూడదు. ప్రస్తుతానికి నేనొక్కణ్నే ఆర్జనపరుణ్ని. అందుకని ఇందాకా చెప్పినట్టుగా నా ఆరోగ్యం ముఖ్యం. గుడ్లు బలవర్థకాలని చిన్నప్పుడు మనం చదువుకొన్నదే. నా బడ్జెట్ రోజుకి ఎనిమిది గుడ్లు. నా ఆరోగ్యమే కుటుంబ ఆరోగ్యమని నేను మూడు గుడ్లు లాగించడంలో అధర్మమేమీ లేదు. నలుగురికీ చేతి ఖర్చులకిస్తున్నాను. ఆఖరిది అప్పుడప్పుడూ ఏవో అరటి పళ్లూ, సంత్రాలూ (కమలాఫలాలు) తెస్తుందే తప్ప మిగిలిన ముగ్గురూ ఒక్క పైసా ఇంటికోసమని పెట్టరు! నేను వాళ్ల కడుపులు కాల్చట్లేదు. శ్రమిస్తున్న వాణ్ణి కాబట్టి ఓ రెండు గుడ్లు ఎక్కువ తింటున్నానంతే!''

''నీ వ్యవహారం చూస్తే భారతంలోని శకుని గుర్తొస్తున్నాడు'' ఇంకా ఏదో అనబోయేలోగా మిత్రా అడ్డు తగిలాడు.

''దుర్యోధనుని మీద ప్రతీకారం తీర్చుకోవడానికి శకుని తల్లిదండ్రులూ, ఇతర బంధువులూ చెరసాలలో తమకి పెట్టేదాన్ని శకునికిచ్చి అతను బలంగా ఉండడానికి దోహదం చేశారు. నేను నా కుటుంబం సజావుగా నడవడం కోసం నా ఆరోగ్యం. సంగతి చూసుకొంటున్నాను. నా గురించి మరీ అంత దుర్మార్గంగా ఆలోచించకు'' అన్నాడు మిత్రా సరదాగానే.

''దుర్మార్గంగా ఆలోచించట్లేదుకానీ, కనీసం నా ఎదురుగా నువ్వలా చేసి ఉండకూడదనుకొంటున్నాను. మీ వాడి మనసులో..''

''గాయపడి ఉండొచ్చంటావ్, అంతేగా? ఇది ప్రతీరోజూ జరిగే తంతే! కనీసం వాడీరోజు నీ ఎదురుగా అలా ప్రవర్తించకుండా ఉండాల్సింది. ఆ ఎనిమిదో గుడ్డుని నా భార్య తినే రోజు కోసం ఎదురు చూస్తున్నాను. ఇవ్వాళా ఆశాభంగమే అయింది!''

''రేపు మీరిద్దరూ మీ కుర్రవాళ్ల మీద ఆధారపడవలసి వచ్చినప్పుడు వాళ్లూ ఇదే ధోరణిలో ప్రవర్తిస్తే?'' ప్రశ్నించాను.

''నేనేమీ అనుకోను. శ్రీమతి ఆ ఎనిమిదో గుడ్డుని ఇద్దరి కుర్రాళ్లకి చెరో సగమూ ఇచ్చి చేసే త్యాగాన్ని వాళ్లు మరిచిపోరనే అనుకొంటాను. అంచేత ఆవిడ గురించి నాకు బెంగ లేదు. అయినా నీ వెర్రికాని ఓ ప్రణాళిక ప్రకారం ఖర్చు పెట్టే మనిషిని, మా ఇద్దరి భావి జీవితం కోసం కూడా పొదుపు చెయ్యకుండా ఉంటానని ఎలా అనుకొన్నావ్? ఆప్తుడవు కాబట్టి నీతో ఒక విషయం చెప్పక తప్పదు.

రాజధాని ఎక్స్‌ప్రెస్ మిగతా బళ్ల కంటే వేగంగా పోవడానికి కారణం బోగీల సంఖ్య తగ్గించడమే. కుటుంబ నియంత్రణ పట్ల అవగాహన లోపించిన కారణంగా ఈ ఇంజన్‌కి భారం ఎక్కువైన మాట వాస్తవం. అందుకే ఈ ప్రయాసలన్నీ!'' మిత్రా నవ్వుతూనే అన్నాడు. వీడ్కోలిచ్చి వెళ్లాడు.

మిత్రా తర్కం నాకు సబబుగానే ఉందనిపించింది. రైలునంతటినీ ఒకే ఇంజను లాగుతున్నప్పుడు, ఇంజనులో ఏ భాగం చెడినా రైలంతా ఆగిపోతుంది. వేగాన్ని పెంచడానికి బోగీల బరువు తగ్గించడమే కాకుండా, ఇంజను అశ్వశక్తికనుగుణంగా దాని ఆకారాన్ని కూడా 'స్ట్రీమ్ లైన్' చెయ్యాలి.

సదస్సులో నేను చదవబోయే పేపరు రైలింజన్ల డిజైన్ గురించే.

నేను చదివే పేపర్లో జీవితం పట్ల మిత్రా దృక్పథాన్ని అక్కడక్కడా సమన్వయం చేసి చెప్పడానికో అనుభవం లభించింది.

అంతేకాదు నేను గడిపే జీవన విధానాన్ని మిత్రా జీవన విధానంతో బేరీజు వేసుకొనేందుకు మంచి అవకాశామూ లభించింది, మార్చుకోవలసిన అవసరమూ కనబడింది.

## ఊహించని మలుపు

**సినిమాల్లో కథ, కథనం ఊహించని మలుపుతో అందరిలో ఉత్కంఠని రేపుతుంటాయి. అయితే నిత్య జీవితంలో కూడా ఊహించని సంఘటనలు జరిగి హీరోల తలరాత మారిపోతుంది. ఈమధ్య జోథ్‌పూర్ కోర్టు ప్రముఖ బాలీవుడ్ నటుడు సల్మాన్‌ఖాన్‌కి ఐదేళ్ల జైలుశిక్షతో పాటూ పాతికవేల రూపాయల జరిమానా కూడా విధించింది. వన్యప్రాణి సంరక్షణ చట్టం పరిధిలోని ఈ కేసు అత్యంత ప్రతిష్ఠాత్మకంగా మారింది. సినిమాల్లో ఎన్నో మలుపులు తిరిగే హీరో కథ ఇప్పుడిలాంటి మలుపునకు దారితీసింది.**

